ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కసరత్తు..!

జోరందుకున్న ఎస్సీ జనాభా లెక్కింపు ప్రక్రియ

- వర్గీకరణ అమలు కోసమే..
- 30 వేలమంది సిబ్బంది
- రూ.8కోట్లు ఖర్చు

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రంలో కసరత్తు జోరందుకుంది. ఎస్సీలు, ఉపకులాలకు సంబంధించిన నిర్దిష్టమైన జనాభా తదితర సమాచారం సేకరించే ఉద్దేశంతో ఎస్సీ జనాభా లెక్కింపులను జరపనున్నారు. మే మొదటివారంలో ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని ఏకసభ్య విచారణా కమిషన్ క్రియాశీలకమైంది.

ఉపకులాల జనాభా లెక్కింపునకు అంగీకారం

కమిషన్ మధ్యంతర నివేదికను, సిఫారసులను రాష్ట్రమంత్రివర్గ సభలో అంగీకరించి ఎస్సీ జాబితాలో ఉండే 101 ఉపకులాల జనాభా లెక్కింపునకు అంగీకారం తెలిపారు. జనాభా లెక్కింపు తర్వాత ఏయే ఉపకులాల్లో ఎంతమంది ఉన్నారనేది నిర్ధారించాక శాస్త్రీయంగా రిజర్వేషన్ ప్రమాణాన్ని వర్గీకరించదలిచారు. కమిషన్‌కు రెండు నెలల గడువు ఉండగా 40 రోజుల్లోనే పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నా సమగ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మరో 20 రోజులు ప్రభుత్వమే వెసులుబాటు కల్పించింది. పాలనా యంత్రాంగంతోపాటు విధాల సహకరించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశారు. కాలానికి అనుగుణంగా కమిషన్ సూచించే సమాచారాన్ని, ఇతరత్రా సౌలభ్యాలను సమకూర్చడం సమితి బాధ్యతగా ఉంటుంది. మంత్రివర్గ నిర్ణయం ప్రకటించిన తర్వాత జస్టిస్ నాగమోహన్‌దాస్ కీలకమయ్యారు. చీఫ్ సెక్రటరీతో ఇప్పటికే రెండుసార్లు సమావేశమై విస్తృతంగా చర్చలు జరిపారు. సాంఘిక సంక్షేమంతోపాటు ఇతరశాఖల ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన బాధ్యతలు కేటాయించే విషయమై సభలో తీర్మానించారు. త్వరితగతిన సమాచారాన్ని సమకూర్చాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేకంగా ఇన్‌చార్జ్ బృందాలను ఏర్పాటు చేయాలని సభలో నిర్ణయించారు.

ప్రత్యేక వెబ్ పోర్టల్

సమాజానికి సంబంధించి ఆసక్తిగల వారు స్వయంగా నిర్దేశించిన నమూనాలో ప్రశ్నావళికి సమాధానాలు, వివరాలతో అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించాలని కమిషన్ యోచిస్తోంది. దరఖాస్తు నమూనా భర్తీ పట్ల ఎవరికైనా సందేహం ఉంటే సలహాలు, మార్గదర్శకాలు ఇచ్చేందుకు ప్రత్యేకమైన మొబైల్ నెంబరును ఇవ్వనున్నారు. వీటికి సంబంధించి సమాచారాన్ని ప్రసారం చేసి అవగాహన తీసుకురావాలన్న ప్రతిపాదనతో ఉన్నారు.

- సమగ్ర జనాభా లెక్కలవేళ ఆదికర్ణాటక (ఏకే), ఆది ద్రావిడ (ఏడీ), ఆది ఆంధ్ర (ఏఏ), ఎస్సీ కులాల పేర్లను నమోదు చేయించారు. 36 లక్షలకంటే ఎక్కువమంది సమాజానికి చెందినవారు ఉన్నారు. ఏ కులం నుంచి ఉపకులానికి చెందినవారనేది కీలకంగా గుర్తించదలిచారు. వర్గీకరణ శాస్త్రీయంగా, చట్టానికి లోబడి ఉండాలనే కారణంతోనే లెక్కింపునకు తీర్మానించారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 18.85లక్షలమంది ఏకే, ఏడీ, ఏఏతోపాటు తదితరులు ఏ వర్గానికి చెందిన వారనేది వంశపారంపర్యంగా గుర్తించారు.
- షెడ్యూల్డ్ కులాలు, ఉపకులాల లెక్కింపు ప్రక్రియకు 30వేలమంది సిబ్బంది అవసరంగా నిర్ధారించారు. ఇందుకోసం 8 కోట్ల రూపాయలు ఖర్చుకు అంచనా వేశారు. కమిషన్ బాధ్యతలు అప్పగించిన శాఖలు ఇందుకు సంబంధించిన ప్రస్తావనలను సిద్ధం చేస్తున్నాయి. కమిషన్‌తోపాటు వివిధ శాఖలు దరఖాస్తు నమూనా తయారీకి చేతులు కలిపాయి. షెడ్యూల్డ్‌కులాలు, ఉపకులం ఏది అనేది ఖచ్చితంగా నిర్ణయించడంతోపాటు వివిధ విధాల ద్వారా సమాచారాన్ని సేకరించేలా దరఖాస్తులో పలు కాలంలను పొందుపరిచారు.

కార్యాచరణ ఇలా...

నగర, పట్టణ ప్రదేశాలలో బూత్‌లవారీగాను, గ్రామీణ ప్రదేశాలకు సంబంధించి ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో లెక్కింపు ప్రక్రియ జరపదలిచారు. కులగణన లెక్కింపు సిబ్బంది ఇంటింటికీ వెళ్లడమే కాకుండా గ్రామపంచాయతీలను, బాపూజీ కేంద్రాలలో వివరాలు సేకరిస్తారు. సిద్ధం చేసిన దరఖాస్తును భర్తీ చేసి సమగ్ర సమాచారాన్ని పొందుపరిచి కుల, ఉపకులాలను నిర్ధారిస్తారు. విద్య, ఉద్యోగం, కుటుంబ నిర్వహణ, ఆదాయ మూలాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు, ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లు సద్వినియోగం చేసుకునే సమాచారం కూడా సేకరించనున్నారు. షెడ్యూల్డు కులాలు, ఉపకులాల్లో విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ, వెనుకబాటుదనానికి సంబంధించి గణాంకాల ఆధారంగా వర్గీకరణ జరపదలిచారు.

- రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కల్పించేందుకు రూపొందించిన మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని ఏకసభ్య విచారణ కమిషన్ గడువును 2025 మే 31వరకు విస్తరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ మార్చి 27న ముఖ్యమంత్రికి మధ్యంతర నివేదికను సమర్పించింది. ఇందులో సిఫారసులపై చర్చించి సదరు కమిటీకి మరిన్ని రోజులు గడువు అవసరమని మే నెలాఖరు వరకు విస్తరింపచేసినట్టు సాంఘిక సంక్షేమశాఖ ఆదేశాల్లో పేర్కొంది.
- ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ అభిప్రాయం మేరకు ఎస్సీ కులాల సమీక్షకు సంబంధించి ముందస్తు తయారీకై ఉన్నతస్థాయిలో రెండు విడతల సభలు జరిగాయి. పలు తీర్మానాలు చేశామని, శాఖల మధ్య సమన్వయం, పలుశాఖలకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించామన్నారు.



రిటైర్డ్ జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్



తీర్మాణాలు రద్దు

అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యేల ఫిర్యాదు


బళ్లారి,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బళ్లారి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బుడా)లో ఇంతక మునుము జరిగిన సమావేశంలో తీసుకున్న తీర్మాణాలు రద్దు చేస్తూ పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మార్చి, జూలై మాసాల్లో రెండు పర్యాయాలు బుడా అధ్యక్షుడు జేఎస్ అంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అప్పుడు జరిగిన సమావేశంలో బుడా పరిధిలో వచ్చే లే అవుట్ల అనుమతులు, రోడ్ల అభివృద్ధి తదితరాలపై సమావేశంలో తీర్మానం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం బుడాలో అక్రమాలు జరిగాయని లోకాయుక్తకు ఫిర్యాదులు అందాయి. లోకాయుక్త దాడులు చేసి అక్కడ ఉండే అధికారులను విచారించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ బుడా కమిషన్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. బుడాలో అక్రమాల జరిగాయని శాసనసభ్యులు నారా భరత్‌రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే గణేష్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. పట్టణావృద్ధి చట్టంలో అంశాలను, నిబంధనలను ఏమాత్రం పాటించకుండా నిర్ణయాలు తీసుకున్నారని రుజువు కావడంతో అప్పుడు తీసుకున్న నిర్ణయాలు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రియల్ వ్యాపారులు రూ. కోట్లకు పెట్టుబడులు పెట్టి బుడా లే అవుట్ల కోసం ఎకరాకు ఇంత అని ముట్టచెప్పామని, తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

కొడగు జిల్లాలో బీజేపీ నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ చేపట్టిన జనాక్రోశ యాత్ర మూడోరోజు కొడగు జిల్లా కేంద్రం మడికేరిలో సాగింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వంద వెనుకబడిన కులాలు ఉన్నాయని వాటన్నింటినీ విస్మరించి కేవలం మైనారిటీలకు కాంట్రాక్టు పనులలో 4శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 50 నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. ర్యాలీలో ప్రతిపక్షనేత అశోక్, నాయకులు శ్రీరాములు, ఎంపీ యదువీర్, నళిన్‌కుమార్ కటీల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో విజయేంద్ర తదితరులు



లోకాయుక్త కార్యాలయం వద్ద నివేదికతో ఎన్‌ఆర్ రమేశ్

17వేల కోట్ల గ్రాంట్లు దుర్వినియోగం

సిద్దూ ప్రభుత్వంపై లోకాయుక్తకు ఎన్‌ఆర్ రమేశ్ ఫిర్యాదు

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్‌లో అధ్యక్షుడి మార్పు, కేబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక గందరగోళం కొనసాగుతున్న తరుణంలోనే బీజేపీ నేత, బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ ఎన్‌ఆర్ రమేశ్ భారీ ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ యోజనలో 17వేల కోట్ల రూపాయల గ్రాంట్ల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కర్నాటక నగర నీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ బోర్డు, ప్రజాపనులశాఖకు సంయుక్తంగా కేంద్రప్రభుత్వ అమృత్ యోజన పథకం బాధ్యతలు అప్పగించాయి. ఈ పథకంలో 17వేల కోట్ల గ్రాంటు దుర్వినియోగం అయ్యిందని ఆరోపించారు. నగరాభివృద్ధిశాఖ మంత్రి భైరతి సురేశ్, మునిసిపల్ వ్యవహారాలశాఖ మంత్రి రెహమాన్‌ఖాన్, కర్నాటక నీటీ సరఫరా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ బోర్డు ఛైర్మన్ - ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణి, మునిసిపల్ వ్యవహారాలశాఖ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి ప్రభులింగ కవలకట్టి, బోర్డు చీఫ్ ఇంజనీర్లు బీఎస్ చంద్రప్ప, టీఎన్ ముద్రాజణ్ణలపై 7,281 పేజీలతో వినతిని లోకాయుక్త అధికారులకు బుధవారం అప్పగించారు. అనంతరం లోకాయుక్త కార్యాలయం వద్ద ఎన్‌ఆర్ రమేశ్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో మహానగరాలు మినహాయించి నగర, పురసభలలో తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, భారీ కాలువల నిర్మాణం, పచ్చదనం పెంపు, పార్కుల ఏర్పాటు వంటి పనులకోసం 2015 జూన్‌లో కేంద్రప్రభుత్వ అమృత్ యోజనను ప్రారంభించింది. రాష్ట్రంలో అమృత్‌యోజన 27 నగరసభలలో అమలు చేసేందుకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 16,899.66 కోట్ల రూపాయలు గ్రాంటు విడుదల చేశారు. 75శాతం గ్రాంట్లు శాఖలకు విడుదల కాగా 25శాతం డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు విడుదలైందన్నారు. రూ.5799 కోట్లకు 137 పనులకు టెండరు ప్రక్రియ ముగియగా 3189 కోట్లతో 93 పనులకు టెండర్లు ముగిసి పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. పనులు పూర్తి చేయాలని ఆదేశించినా 50శాతం మాత్రమే సాధ్యం చేశారన్నారు. అవినీతి అధికారులు, మంత్రుల నిర్లక్ష్యంతో గ్రాంట్లు దుర్వినియోగం అయ్యాయన్నారు. 27 నగరసభలలో 50శాతం పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చేశారన్నారు. ఒకే పనికి 3 స్టేజ్‌లలో ఫోటో తీసి పనులు పూర్తయినట్టు రిపోర్టు సిద్ధం చేశారన్నారు. టెండరు ప్రక్రియ లోనూ కొంతమంది కాంట్రాక్టర్‌లకు అవకాశం ఇచ్చారని ఆరోపించారు. కోట్లాదిరూపాయల పనుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని లోకాయుక్తను కోరినట్టు తెలిపారు.



బసవ రాజరాయరెడ్డి

అవినీతిలో కర్ణాటక నెంబరువన్

- సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో కర్ణాటక నెంబరువన్ అని సీఎం ఆర్థిక సలహాదారుడు, సీనియర్ ఎమ్మెల్యే బసవరాజరాయరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏదైనా రాష్ట్రంలో అవినీతి ఎక్కువని విచారం వ్యక్తం చేశారు. ప్రాంతీయ అసమానత నివారణ సమితి కొప్పళలో మంగళవారం జరిపిన జిల్లాస్థాయి చర్చాగోష్టిలో బసవరాజరాయరెడ్డి మాట్లాడారు. అవినీతి తీవ్రమైనందున నాణ్యంగా అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. 50-60ఏళ్లపాటు మన్నిక రావాల్సిన ప్రభుత్వ నిర్మాణాలు దశాబ్దన్నర కాలానికే కూలిపోతున్నాయన్నారు. కల్యాణ కర్ణాటకలో అవినీతి మరింత ఎక్కువగా తాండవిస్తోందన్నారు. భారీగా అవినీతి జరుగుతుంటే ప్రాంతీయ అసమానత నివారణ ఎలా సాధ్యమన్నారు. పాలకులు ఎలా ఉంటారో... అధికారులు అలా ఉంటారన్నారు. ముఖ్యమంత్రి ఏమైనా చెప్పుకోని అవినీతి విషయంలో నా అభిప్రాయం ఇదే అన్నారు. 22ఏళ్ల కిందట బీఎం నంజుండప్ప నివేదికపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఆర్థికనిపుణులు ప్రొఫెసర్ ఎం గోవిందరావు అధ్యక్షతన కర్ణాటక ప్రాంతీయ అసమానత నివారణ కమిటీని ఏర్పాటు చేశారు. అవినీతి ఎక్కువ ఉందని నా వ్యాఖ్యలను సిఫారసులో చేర్చాలని కమిటీ కార్యదర్శి విశాల్ ఆర్‌కు సూచించారు. కాగా బుధవారం బసవరాజరాయరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. కొప్పళ సభలో వ్యాఖ్యలపై వివరిస్తూ ప్రాంతీయ అసమానత నివారణ కమిటీ సభలో మాట్లాడడం మినహా మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడలేదన్నారు. కానీ అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను మీడియా తప్పుగా అర్థం చేసుకుందని ఇందుకు తాను బాధ్యుడిని కానన్నారు. కల్యాణ కర్ణాటకలో నాణ్యతలేని పనుల ఉద్దేశ్యంలో వ్యాఖ్యలు చేసినట్టు పేర్కొనగా మీడియా తప్పుగా ప్రచారం చేసిందన్నారు.

మాజీ మంత్రి ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఆమోదం

వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతి వివాదం

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతి వివాదంలో మంత్రి పదవిని కోల్పోయిన నాగేంద్రకు రాజ్‌భవన్ మరోషాక్ ఇచ్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వినతికి అనుగుణంగా ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతులు ఇచ్చారు. నాగేంద్ర, జే పద్మనాభలు కేసునుంచి ఉపశమనం కలిగించేలా కోర్టును ఆశ్రయించారు. సదరు పిటీషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈరుణంలోనే గవర్నర్ ప్రాసిక్యూషన్‌లకు అనుమతిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాగేంద్రకు సంక్లిష్ట పరిస్థితి నెలకొంది. వాల్మీకి కార్పొరేషన్‌లో 95 కోట్ల రూపాయలు నగదు బదిలీ చేశారు. వసంతనగర్ బ్యాంకుశాఖ నుంచి ఎంజీ రోడ్డుశాఖకు బదిలీ చేసి అక్కడనుంచి హైదరాబాద్‌లోని గ్రామీణబ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకోవడంతో వివాదం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా బ్యాంకు ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. సిట్ చార్జ్‌షీట్‌లో నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇవ్వగా ఈడీ మాత్రం తన చార్జ్‌షీట్‌లో ప్రధానసూత్రధారిగా పేర్కొంది. ఇలా సాగుతుండగానే ఈడీ దర్యాప్తు కొనసాగించకుండా కోర్టును ఆశ్రయించారు. ఈలోగా సమగ్ర దర్యాప్తుకు అవకాశం ఇస్తూ గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారు.

మంత్రికి హనీట్రాప్... ప్రజలకు పన్నుల ట్రాప్

మండిపడ్డ జేడీఎస్ నేత నిఖిల్



బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని జేడీఎస్ యువనేత నిఖిల్ కుమారస్వామి మండిపడ్డారు. రాష్ట్రంలో పాలనపై ఆయన వ్యంగ్యం చేశారు. మంత్రికి హనీట్రాప్, రాష్ట్ర ప్రజలకు పన్నుల ట్రాప్ సాగుతోందని విరుచుకుపడ్డారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు అవినీతిపై జేడీఎస్ ఆధ్వర్యంలో 'సాకప్ప సాకు! కాంగ్రెస్ సర్కార' (చాలప్ప చాలు కాంగ్రెస్ పాలన) పేరిట నిరసన చేపట్టదలిచామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలపై భారం మోపుతూనే ఉన్నారన్నారు. శనివారం ఫ్రీడంపార్కులో కేంద్రమంత్రి కుమారస్వామి నేతృత్వంలో ఆందోళన చేపట్టదలిచామన్నారు. రాష్ట్రప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు.

నేటి నుంచి టీటీడీ ఆలయంలో వార్షిక వసంతోత్సవం



బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంకు అనుబంధమైన మల్లేశ్వరం వయ్యాలికావల్ వేంకటేశ్వర ఆలయంలో గురువారం నుంచి వార్షిక వసంతోత్సవాలు జరుగుతాయని ఏఈఓ బాలరాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలనుంచి 4.30 వరకు స్నపన తిరుమంజనం, 5.30 నుంచి 6 వరకు ఆస్థాన సేవ, 6 నుంచి 7వరకు ఊంజల్‌సేవ కొనసాగుతాయన్నారు. శనివారం దాకా వసంతోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలలో పాల్గొనే వారు వెయ్యిరూపాయలు చెల్లించి ఇద్దరు పాల్గొనవచ్చునన్నారు. ప్రసాదం అందచేస్తామన్నారు. భక్తులు వసంతోత్సవాలలో పాల్గొనాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు సూపరింటెండెంట్ జయంతి తెలిపారు.



భక్తజన సందోహం నడుమ సాగుతున్న నంజనగూడు శ్రీకంఠేశ్వరస్వామి రథోత్సవం



కనులపండువగా పంచ రథోత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరొందిన మైసూరు జిల్లాలోని నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయంలో పంచరథోత్సవాలు కనులపండువగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున 5 నుంచి 5.40 గంటల మధ్య శుభ మీన లగ్నంలో రథోత్సవం జరిగింది. అర్ధరాత్రి నుంచే జాతర ఉత్సవాలు, పూజలు, హోమాదికాలు జరిగాయి. పార్వతీదేవి, గణపతి, సుబ్రహ్మణ్య, చండకేశ్వరి దేవతలకు ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 6 గంటలకు రథోత్సవాలను ప్రారంభించారు. ఏడాదికోసారి జరిగే రథోత్సవానికి మైసూరు, చామరాజనగర, మండ్య నుంచి సరిహద్దులోని తమిళనాడునుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పీయూలో ఫెయిల్

ఆరుగురు విద్యార్థుల ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పీయూ ద్వితీయ పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, మరికొంత మంది అనుకున్నంత మార్కులు సాధించలేదని నిరాశకు లోనైన విద్యార్థులు వివిధ జిల్లాల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆరుమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మైసూరు జిల్లా ఒంటికొప్ప ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఐశ్వర్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బళ్ళారి జిల్లా సిరుగుప్ప తాలూకా అగసనూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మి సిరుగుప్ప ఆత్మహత్య చేసుకున్నారు. దావణగెరెలోని ప్రైవేట్ కళాశాల విద్యార్థిని సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించలేదని కృప అనే విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. హావేరి జిల్లా హంసబావి పోలీస్ స్టేషన్ పరిధిలో కావ్య బసప్ప లమాణి ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరు విద్యారణ్యపుర సప్తగిరి లే అవుట్‌లో కేపీ మనోజ్ 79శాతం మార్కులు మాత్రమే వచ్చాయని ఆత్మహత్య చేసుకున్నాడు. చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె తాలూకా కృప అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు.

ఈతాకుకు యమా డిమాండ్



అరటి పిలకల సంరక్షణకు వినియోగం

ఈత పట్ట రూ.3

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు

ఈత పట్టలను గతంలో కోసుకొచ్చి, ఆకులను తొలగించి కర్రలతో బుట్టలు, జల్లలు అల్లేవారు. రానురాను వాటిని అల్లేవారు కరువయ్యారు. కొనే వారూ లేరు. దీంతో ఈత పట్టలను కోసేవారు కనిపించకుండా పోయారు. అనూహ్యంగా ప్రస్తుతం వాటికి డిమాండ్ ఏర్పడింది. ఎండల నుంచి అరటి పిలకలను రక్షించుకునేందుకు రైతులు ఈత పట్టలను వినియోగిస్తున్నారు. మండలంలో ఈత చెట్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రైతులు తెచ్చుకుని మరీ.. తోటల్లో వాడుతున్నారు. దీంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ఈత పట్ట రూ.3తో అమ్ముడుపోతోంది. ఈత పట్టల వ్యాపారం కూడా జోరందుకుంది.

-ఆంధ్రజ్యోతి, పుట్లూరు

పుట్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అరటి పిలకలను నాటుతారు. భానుడి ప్రతాపం నుంచి వాటిని సంరక్షించుకోవడం రైతులకు పెను సవాలే. ఎలాగైనా మొక్కను రక్షించుకోవాలని వినూత్నంగా ఆలోచించిన రైతన్న అరటి పిలకలకు ఈతాకును రక్షణ కవచంగా ఉపయోగిస్తున్నాడు. దీంతో అరటి పిలకలకు ఎండ వేడిమి తగలకుండా ఈతాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మండలవ్యాప్తంగా 2500 ఎకరాలకుపైగా ఈతాకుచాటున అరటి నాటారు. పుట్లూరు, కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, ఓబులాపురం, మడ్డిపల్లి, మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, కుమ్మనమల, చాలవేముల తదితర గ్రామాల్లో అరటి ఎక్కువగా సాగుచేస్తున్నారు. అరటి పిలకల పక్కనే ఈతాకు నాటుతున్నారు. దీంతో ఎండవేడిమి పూర్తిగా ఈతాకు మీద పడుతోంది. వెరసి అరటి పిలక ఎదుగుదలకు ఇబ్బంది లేకుండా పోతోంది. దీంతో ఏప్రిల్, మే నెలల్లో మొక్కలు నాటే రైతులు ఎక్కువగా ఈతాకుపైనే మక్కువ చూపుతున్నారు. గతంలో కాగితాలను అరటి పిలకలకు రక్షణగా ఉంచేవారు. అవి ఎండవేడిమిని పూర్తిగా నియంత్రించినప్పటికీ మొక్కలో పెరుగుదల కనిపించకపోవడంతో రైతులు ఈతాకు ఉపయోగిస్తున్నారు.



అరటి పిలకలకు ఈత ఆకును రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన దృశ్యం

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

అరటికి రక్షణ కవచంగా ఉపయోగించే ఈతాకు పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో ఆత్మకూరు, ఉరవకొండ, ఆలూరు, చెన్నేకొత్తపల్లి, సనప, ఆదోని, గుత్తి తదితర ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆటోల్లో తీసుకొచ్చి, రైతులకు విక్రయిస్తున్నారు. నెలరోజుల క్రితం ఈతాకు కొమ్మ రూ.2.50 ఉండగా.. డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం రూ.3తో విక్రయిస్తున్నారు. ఎకరాకు 1,300 అరటి పిలకలకు ఒక్కో దానికి ఒక్కో కొమ్మ ఏర్పాటు చేస్తున్నారు. ఈ లెక్కన ఎకరాకు రవాణా ఖర్చుతో సహా దాదాపు రూ.4వేల మేర రైతు భరించాల్సి వస్తోంది.

ఈతాకుతో లాభమే..



అరటి పిలకలకు ఈతాకు రక్షణగా ఏర్పాటు చేయడం లాభదాయకమే. ఐదెకరాల్లో అరటి నాటా. ఎకరాకు సరిపడా ఈత ఆకు కోసం రూ.4 వేలు ఖర్చు చేశా. రైతులు అందరూ ఈతాకు వాడుతుండడంతో డిమాండ్ పెరిగింది.

- రామాంజులరెడ్డి, రైతు, రంగరాజుకుంట

డిమాండ్ ఏర్పడడంతో విక్రయిస్తున్నా..



గతంలో నేను సాగుచేసిన అరటి పంటకు ఈతాకు కొనుగోలు చేశా. రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో నేనే ఇతర ప్రాంతాల నుంచి కోత కోసి, తీసుకొచ్చి విక్రయిస్తున్నా.

- సతీష్, ఎల్లుట్ల గ్రామం



ఈత పట్టలు

నర్సరీల్లో అవినీతి మొక్కలు



పెన్నహోబిలం నర్సరీలో సమస్యపై చర్చిస్తున్న డీఎఫ్ఓ విఘ్నేష్..

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు అక్రమాలకు అడ్డాగా మారా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రికార్డుల్లో మొక్కలను లక్షల్లో పంపిణీ చేసినట్లు చూపుతున్నారు. కానీ అధికారులు క్షేత్రస్థాయి పర్యట నకు వెళితే నర్సరీల్లో మొక్కలు కనిపించవు. ఇలా మసిపూసి మారేడు కాయ చేసి నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లుల మంజూరులో కూడా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్న ట్లు సమాచారం. సోషల్ ఫారెస్ట్ విభాగంలో రెగ్యులర్ డీఎఫ్ఓలు లేకపోవడం కిందిస్థాయి సిబ్బందికి వరంగా మారిందన్న ప్రచారం ఉంది.

ఒక్కరే 10.5 లక్షలు..!

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నర్సరీల్లో మొక్కల పెంపకానికి సంబంధించి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. సోషల్ ఫారెస్ట్ విభాగం నుంచి ఈ ఏడాది 30 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచేలా అంచనాలు తయారు చేశారు. ఇందులో ఇప్పటికే 15 లక్షల మొక్కలు నర్సరీల్లో గ్రౌండ్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో 15 లక్షల ఎత్తైన మొక్కలు వచ్చే ఏడాదికి పంపిణీ చేసేలా నర్సరీల్లో గ్రౌండ్ చేయడానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రౌండ్ అయిన 15 లక్షల మొక్కల సంరక్షణకు సోషల్ ఫారెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఇందులో ఓ మహిళా సిబ్బంది ఒక్కరే 10.5 లక్షల మొక్కలు సిద్ధం చేసినట్లు రికార్డులు నమోదు చేశారు. మరో 4.5 లక్షలు మిగిలిన నర్సరీల్లో పెంచుతున్నట్లు రికార్డులు నమోదు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో లేని మొక్కలను రికార్డుల్లో చూపి అందరికీ పంపిణీ చేశామని చెప్పి, నిధులు స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలీల బిల్లులు స్వాహా..!

పెన్నహోబిలంలో ఉన్న నర్సరీకి సంబంధించి అక్కడ పని చేసిన కూలీలకు 2021-22 నుంచి ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. అయితే మంజూరైన బిల్లులను నర్సరీలు నిర్వహించే సిబ్బంది స్వాహా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఎప్పుడు బిల్లులు మంజూరైనా కేవలం మెటీరియల్ బిల్లులు మాత్రమే పడ్డాయని చెబుతూ కూలీలకు సొమ్ము ఎగ్గొడుతున్నట్లు సమాచారం. దీంతో నర్సరీల్లో పని చేసేందుకు కూలీలు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. ఇలా గత ఐదేళ్లుగా వచ్చిన నిధులను అక్కడి సిబ్బంది దిగమింగి తమకు ఏమి తెలియదన్నట్లు వ్యవరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల కిందట సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ విఘ్నేష్ పెన్నహోబిలం నర్సరీని తనిఖీ చేశారు. అక్కడ మొక్కలు పెంచడానికి పాలిథిన్ కవర్లలో నింపడానికి తోలిచ్చిన మట్టి తప్ప మరో మెటీరియల్ కనిపించలేదు. గతంలో అక్కడ పని చేసిన సిబ్బంది నిర్వాకంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని కూలీలు చెప్పడంతో డీఎఫ్ఓ ఖంగుతిన్నారు. డీఎఫ్ఓ విజిట్ నేపథ్యంలో అక్కడికి వెళితే తమ అక్రమాల గురించి కూలీలు బయటపెడతారనే భయంతో పలువురు సిబ్బంది ఎస్కేప్ అయినట్లు తెలిసింది.



వచ్చే సీజన్‌కు పనులు పూర్తి

హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం నుంచి నీటి విడుదల చేసే సమయానికి హెచ్చెల్సీ కింద చేపడుతున్న పనులన్నీ పూర్తి చేస్తామని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సుమారు రూ.50కోట్లకు పైగా నిధులతో హెచ్చెల్సీ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఇలా

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎంత ఆయకట్టు ఉంది?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో 2,85,743ఎకరాల ఆయకట్టు ఉంది. అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా 1,45,987ఎకరాల ఆయకట్టు ఉంది. కర్నూలు జిల్లాలో 14,255 ఎకరాలు, కడప జిల్లాలో 1,25,501ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రశ్న: 2024-25 సంవత్సరానికి సంబంధించి హెచ్చెల్సీకి ఎంత నీరు టీబీ డ్యాం నుంచి కేటాయించారు ?

ఎస్ఈ: టీబీ డ్యాంలో 198.50టీఎంసీల నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీ 2024-25 సంవత్సరానికి గాను 33.930టీఎంసీల నీటిని కేటాయించారు. ఏపీ బోర్డర్ 105కిలోమీటరు వద్దకు 29.626టీఎంసీల నీరు చేరింది.

ప్రశ్న: ఎంత నీటిని ఏయే వాటికి ఉపయోగించారు....?

ఎస్ఈ: జిల్లా సరిహద్దుకు చేరిన 29.626టీఎంసీల నీటిలో తాగునీటి కోసం 8.278టీఎంసీల నీటిని ఉపయోగించాం. 13.791టీఎంసీల నీటిని 90,355ఎకరాల ఆయకట్టుకు అందించాం. 33 చెరువులకు 5.04టీఎంసీల నీటిని నింపాం. ఇక 4.215టీఎంసీల నీరు రిజర్వాయర్లలో నిల్వ ఉంది.

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి....?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో కణేకల్లు పెద్ద చెరువు, పీఏబీఆర్, ఎంపీఆర్, సుబ్బరాయసాగర్, ముచ్చుకోట రిజర్వాయర్, చాగల్లు, ఝైలవరం రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పలు చెరువులకు, ఆయకట్టుకు హెచ్చెల్సీ నీరు ఇస్తున్నాం.

ప్రశ్న: గడిచిన ఐదేళ్లలో హెచ్చెల్సీలో ఏయే పనులు చేపట్టారు...?

ఎస్ఈ: గడిచిన ఐదేళ్ల కాలంలో ఒక్క పనికూడా చేయలేదు. అనేక పనులకు నాలుగైదు దఫాలుగా ప్రభుత్వానికి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా...అనుమతి ఇవ్వలేదు, నిధులు ఇవ్వలేదు.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు చేపడుతున్నారు?

ఎస్ఈ: ఇప్పటికే హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవ మీద 25పనులు రూ.2.92కోట్లతో ప్రారంభించాం. మరో 11పనులు హెచ్చెల్సీ పరిధిలో రూ.37కోట్లతో త్వరలో చేపట్టాలి. మరో 183పనులకు రూ.14కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అన్ని పనులు వచ్చే నీటి విడుదల సీజన్ సమయానికి పూర్తి చేయాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం.

క్షయ నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలి

డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్ర జ్యోతి): క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరు అంకితభావంతో పనిచేయాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ సూచించారు. ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో బుధవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో టీబీ కేసులు, నిర్ధారణ పరీక్షలు తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షయ నిర్ధారణకు ప్రత్యేక సర్వే చేశారన్నారు. అనుమానిత లక్షణాలున్న వారికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు, మందులు ఇస్తామన్నారు. ప్రజలకు ఈవ్యాధిలక్షణాల పట్ల అవగాహన కల్పించి వెంటనే వైద్యం పొందేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్‌సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిన్నర తర్వాత..

సర్వజనాస్పత్రిలో పోస్టుల భర్తీకి అడుగులు.. దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో కాంట్రాక్టు వైద్యపోస్టుల భర్తీకి అడుగులు పడుతున్నాయి. గత వైసీపీ హయాంలో 2023 నవంబరులో మొత్తం 72 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎంఆర్ఐ, ఎంఆర్ఎన్, ఓటీ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్ట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, స్పీచ్ థెరపిస్ట్, నెట్ అడ్మినిస్ట్రేటర్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, పెర్ఫ్యూజినిస్ట్, అటెండర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అప్పట్లో 2400కిపైగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని వైద్యాధికారులు అంటున్నారు. ఆ తర్వాత ఆలస్యం కావడం, ఎన్నికలు రావడంతో నియామకాల పక్రియ అప్పట్లో నిలిచిపోయింది. దీంతో అభ్యర్థులు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ కావడంతో ఇక అది చెల్లదని భావించి, నియామకాల గురించే మరచిపోయారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఏడాదిన్నర క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఆ పోస్టులను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర వైద్య శాఖాధికారులు ఆస్పత్రి వర్గాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాటి నోటిఫికేషన్ ఆధారంగా అటెండర్ పోస్టులు నాలుగు మినహా 68 పోస్టులను యథాతథంగా భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో వచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను ఇపుడు మళ్లీ మొదలు పెట్టారు. సంబంధిత సెక్షన్ ఆఫీసర్లతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి బుధవారం దరఖాస్తులను పరిశీలించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే పాత నోటిఫికేషన్ ప్రకారం వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించి, పారదర్శకంగా ఎంపిక పక్రియ చేపట్టి అర్హులకే అవకాశం కల్పిస్తామని మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడాదిన్నర తర్వాత పాత నోటిఫికేషన్ ఆధారంగా పోస్టుల భర్తీకి ఆస్పత్రి అధికారులు శ్రీకారం చుట్టడంతో ఆశలు వదిలేసిన అభ్యర్థులు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు

చాంపియన్ కాకినాడ

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ఫైనల్లో తిరుపతిపై గెలుపు

ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహణకు కృషి: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో కాకినాడ జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన ఫైనల్లో తిరుపతి జిల్లా జట్టుతో తలపడింది. కాకినాడ జట్టు 2-0 గోల్స్ తేడాతో తిరుపతిపై ఘన విజయం సాధించి, ట్రోఫీని కైవసం చేసుకుంది. తిరుపతి రన్నరప్‌గా నిలిచింది. అన్నమయ్య జిల్లా జట్టు మూడోస్థానంతో సరిపెట్టుకుంది. బహుమతుల ప్రదానోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. విజేత, రన్నరప్, మూడో స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. త్వరలో ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహించేందుకు తోడ్పాటు అందిస్తానన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, జిల్లా ప్రధానకార్యదర్శి బందనాదం సూర్యప్రకాశ్, కోచ్ హస్సేన్ పాల్గొన్నారు.



విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పాడి రైతుకు ధీమా

మేలుజాతి ఆవులు



పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు
నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం
ఒక్కసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు

బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడానికి గతంలో ఉన్న పశు బీమా పథకాన్ని పునఃప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పశుబీమా ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకున్నారు. వైసీపీ పాలనలో పథకం నిర్వీర్యమైంది. పశువులను కోల్పోయిన రైతులు బీమా రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే మళ్లీ పశుబీమా పథకాన్ని ప్రారంభించడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఒక కుటుంబానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

ప్రీమియంపై రాయితీ

బీమా ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలం ఉండే బీమాకు 85శాతం సబ్సిడీ ఇస్తోంది. రూ. 15 వేల బీమాకు ప్రీమియం రూ. 960లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.768 పోను రైతు వాటాగా రూ.192 చెల్లించాలి. రూ.30వేల బీమాకు ప్రీమియం రూ.1920. ప్రభుత్వ సబ్సిడీ 1536 రైతు వాటా కింద రూ.384 చెల్లించాలి. రూ.40 వేల బీమాకు ప్రీమియం 2560. సబ్సిడీ రూ.1536 పోగా రైతు వాటా రూ. 1024 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు బీమా వర్తిస్తుంది. 6నెలలు, ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ. 6వేల వరకూ బీమా వర్తిస్తుంది. పెంపకందారులు సంవత్సరానికి రూ.36 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పశుపోషకులు, గొర్రెలు, మేకలు పెంపకదారులు దగ్గరలో ఉన్న పశువైద్యశాలలో బీమా చేయించుకోవచ్చు. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవి ట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు.



నిబంధనలు ఇవే..

బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీలైతే తెల్లరేషన్‌కార్డు జిరాక్సు కాపీలను జతపరచాలి. పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చేవరకు పశువులకు వేసిన ట్యాగ్‌ను తొలగించకుండా ఉండాలి. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడురోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపైన మార్చాలి. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


అవగాహన కల్పించాలి



పశులకు బీమా సౌకర్యంపై గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులకు అవగాహన కల్పించాలి. గతంలో రైతులు ప్రీమియం చెల్లించినా పరిహారం అందలేదు. అందుకే ఈ పథకంపై నమ్మకం లేకుండాపోయింది. అందుకే రైతులు బీమా చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

- సాంబశివరావు, పాడి రైతు, ఎల్‌బీ నగర్, బొమ్మనహాళ్ మండలం

అవగాహన కల్పిస్తున్నాం



పశుబీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రైతు తమ పాడి పశువులకు బీమా చేసుకునేలా అవగాహన కల్పించి, ట్యాగులు వేసుకునేలా చూస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపయోగాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, పశువైద్యాధికారి, రాయదుర్గం

ప్రతి పశువుకు బీమా చేయించండి




పశు పోషకులు ప్రతి ఒక్కరూ తమ పశువులకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పశుబీమా సౌకర్యం కల్పించింది. మూడేళ్లపాటు బీమా ఉంటుంది. ఇప్పటి వరకు మండలంలో 20 ఆవులు, 5 ఎద్దులు, 50 పొట్టేళ్లకు బీమా చేయించాం.

- వెంకటరెడ్డి, పశువైద్యాధికారి, బొమ్మనహాళ్

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

మహావీర జయంతి




అహింసను ప్రబోధించిన జైన మతప్రచారకుడు వర్ధమాన మహావీరుడి జయంతిని ప్రతి సంవత్సరం చైత్రమాసంలో ఘనంగా ఆచరిస్తారు. బీహార్ రాష్ట్రం వైశాలి ప్రాంతం కుండ గ్రామంలో క్రీస్తుపూర్వం 599లో క్షత్రియ కుటుంబంలో జన్మించారు. యశోధరను వివాహమాడి ఓ కుమార్తెకు జన్మనిచ్చిన తర్వాత 36వ యేట సన్యాసం స్వీకరించారు. 12ఏళ్లపాటు తపస్సు చేసి మహావీరుడిగా జైనమత ప్రచారకుడు అయ్యారు. అప్పటికే జైనమతానికి 23మంది తీర్థంకరులు ఉన్నా మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగుచూశాయి. 32ఏళ్లపాటు అహింసాధర్మాని ప్రచారం చేసిన మహావీరుడు 72వ యేట కన్నుమూశారు.

డాక్టర్ శామ్యుయేల్ హాహ్నెమన్ (జయంతి)



జర్మనీ దేశానికి చెందిన 'హోమియోపతి పితామహ'గా పేరొందిన క్రిస్టియన్ ఫ్రెడ్‌రిచ్ శామ్యుయేల్ హాహ్నెమన్ 1755 ఏప్రిల్ 10న జన్మించారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, ఇటాలియన్, గ్రీక్, లాటిన్, అరబిక్, సిరియాక్, చాల్డియాక్, హెబ్ర్యూ తదితర భాషలలో నిష్ణాతులై బోధనలు, అనువాదం చేసే వారు. 1807లో హోమియోపతి పదాన్ని వాడారు. 1843 జూలై 2న కన్నుమూశారు.

స్వామి రామదాస్ (జయంతి)



స్వామి రామదాస్ 1884 ఏప్రిల్ 10న కేరళ రాష్ట్రంలో జన్మించారు. సాధువు, తత్వవేత్త, పరోపకారి, యాత్రికుడు. చిన్నవయస్సులోనే సన్యాసి అయ్యారు. కాసరగూడ్ జిల్లా కన్హన్‌గడ్‌లో ఆనందాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అనుచరులు, భక్తులకు 'శ్రీరామ జయరామ జయజయరామ'ను ఉపదేశించారు. శ్రీరామనామ స్మరణ, ధ్యానం, ఇతరులకు సేవ చేయడాన్ని సూచించారు. 1963 జూలై 25న కన్నుమూశారు. ఆశ్రమం సేవలు కొనసాగుతున్నాయి.

జీడీ బిర్లా (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత ఘనశ్యామ్ దాస్ బిర్లా 1894 ఏప్రిల్ 10న రాజస్థాన్ రాష్ట్రం పిలాని గ్రామంలో జన్మించారు. భారత దేశపు అతిపెద్ద వ్యాపార సముదాయానికి యజమాని. కోల్కత్తాలో బట్టల వ్యాపారంలో రాణించి, దేశవ్యాప్తంగా వస్త్ర తయారీ యూనిట్‌లను స్థాపించారు. హిందూస్థాన్ మోటార్ సంస్థ సంస్థాపకుడు. సిమెంట్, రసాయనాలు, రేయాన్, స్టీల్ ఇలా పలు విభాగాలలో వ్యాపారాన్ని విస్తరించారు. యునైటెడ్ కమర్షియల్ బ్యాంకును, పిలానిలో బిట్స్, టిట్స్ ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించారు. 1983 జూన్ 11న కన్నుమూశారు.

హెచ్ఎస్ దొరస్వామి (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు హారోహళ్ళి శ్రీనివాసయ్య దొరస్వామి 1918 ఏప్రిల్ 10న మైసూరులో జన్మించారు. 2018కి వందేళ్లు పూర్తి చేసుకున్నారు. పాత్రికేయుడిగా వ్యవహరించారు. 1950లో భూదానోద్యమంలో చురుగ్గా పాల్గొని గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతరం కూడా రైతులు, ఇతర కార్మికుల సమస్యల పోరాటంలోనూ, అవినీతి రహిత ఉద్యమంలోనూ పాల్గొన్నారు. గాంధీ సేవా పురస్కారం, బసవ, రామ్‌నాథ్ గోయెంకా జీవిత సాఫల్యం పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2021 మే 26న కన్నుమూశారు.

ఒమర్ షరీఫ్ (జయంతి)



ప్రముఖ హాలీవుడ్ నటుడు ఒమర్ షరీఫ్ 1932 ఏప్రిల్ 10న జన్మించారు. 1954లో 'సిర్రా ఫిల్-వాడి' అనే ఈజిప్షియన్ చిత్రంతో సినీరంగంలోకి అడుగు పెట్టారు. లారెన్స్ ఆఫ్ అరేబియా, డాక్టర్ ఝివాగో వంటి సినిమాల్లో అద్భుతంగా నటించి అంతర్జాతీయంగా పేరొందారు. 'లారెన్స్ ఆఫ్ అరేబియా' సినిమా ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. ఇదే సినిమాకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకున్నారు. మెకన్నాస్ గోల్డ్, ది టెన్ కమాండ్‌మెంట్స్, ది మెమొరీస్ ఆఫ్ మిడ్‌నైట్ వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 70కుపైగా సినిమాలలో నటించారు. 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఒక సీజర్ అవార్డు అందుకున్నారు. 2015 జూలై 10న కన్నుమూశారు.

ఏకే పళనివేల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత ఏకే పళనివేల్ 1948 ఏప్రిల్ 10న తమిళనాడు రాష్ట్రం తంజావూరు ప్రాంతం హరిద్వారమంగళం గ్రామంలో జన్మించారు. డోలు వాయిద్య కళాకారుడు. తండ్రి ఎస్ కుమారవేల్ వద్ద, తదుపరి ముత్తుకుమారస్వామి పిళ్లై వద్ద శిక్షణ పొందారు. సోలో ప్రదర్శనలు ఇచ్చారు. తమిళనాడు ప్రభుత్వ సంగీత కళాశాల, అమెరికాలోని వెస్లియన్ యూనివర్శిటీ, వేల్ యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అన్నామలై యూనివర్శిటీలో సంగీత విభాగంలో 8ఏళ్ల డీన్‌గా వ్యవహరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, సంగీత చూడామణి, కలైమామణి తదితర అవార్డులు పొందారు. తిరువయ్యారులోని త్యాగబ్రహ్మ మహోత్సవ సభకు కార్యదర్శిగా వ్యవహరించారు.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి

చిలమత్తూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) వేగంగా వెళుతున్న బస్సు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (55) బాగేపల్లి నుంచి హిందూపురం వెళుతున్న బాలాజీ ప్రైవేటు బస్సును చిలమత్తూరు బస్టాండులో ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో డోరు వద్దే నిలబడింది. బస్సు ఎర్రకొండ అటవీ నర్సరీ మలుపు వద్దకు రాగానే బస్సు ముందు డోర్ వద్ద ఉన్న ఆదిలక్ష్మమ్మ కిందకు పడిపోయింది. డ్రైవర్ గమనించి బస్సును ఆపాడు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలు వీడి పర్యావరణ ఉద్యమానికి... ఏటీ రామస్వామి



మాజీ ఎమ్మెల్యే ఏటీ రామస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు పూర్తిగా స్వస్తి పలికి పర్యావరణ ఉద్యమానికే అంకితం కావాలని నిర్ణయించినట్టు మాజీ ఎమ్మెల్యే ఏటీ రామస్వామి తెలిపారు. నగరంలో పర్యావరణ నిపుణులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం పర్యావరణానికి ప్రతిరోజూ నష్టం కలిగించేలాంటి చర్యలు సాగుతున్నాయని భవిష్యత్తులో పెను ప్రమాదాలు తప్పవన్నారు. ప్రజలలో అవగాహన తీసుకొచ్చేందుకే 'పరిసరక్కాగి నావు' పేరిట ఈనెల 12న రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక సంఘం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం చేయాలనేది తమ లక్ష్యమన్నారు. పర్యావరణ నిపుణుడు నాగేశ్‌హెగ్డే మాట్లాడుతూ పిల్లలకు ఆస్తులు సంపాదించడం కాదని పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ఆస్తులు ఉన్నంతమాత్రాన ఆరోగ్యంగా జీవించలేరన్నారు. ఇటీవల ప్రకృతిపై దాడి కారణంగా వేడిమి పెరుగుతోందన్నారు. వాతావరణంలో మార్పులు సమాజంపై దుష్పరిణామాలకు కారణమవుతోందన్నారు. గత ఏడాది 180 ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నాయని, ఈ ఏడాది ఇప్పటికే 18 జరిగాయని విచారం వ్యక్తం చేశారు. పర్యావరణం అంటే కేవలం అటవీశాఖ ఒక్కటే కాదని, ప్రభుత్వానికి అనుబంధంగా 12శాఖలు ఉన్నాయన్నారు. అటవీ, జలవనరులు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పట్టు, చిన్ననీటి పారుదల, నగర పాలికెలు, సమాచారశాఖ, యువజనశాఖ, విద్యాశాఖలు అనుబంధమైనవే అన్నారు. సమాచారశాఖ పర్యావరణంపై కనీసం ఒక కార్యక్రమం కూడా జరపలేదని విచారం వ్యక్తం చేశారు. గ్యారెంటీలు కాదని, గ్యారంటీలదే ప్రచారం తీవ్రమైందన్నారు. పర్యావరణ నిపుణుడు యల్లప్పరెడ్డి మాట్లాడుతూ 7400 కిలోమీటర్ల సముద్ర తీరం ఉందని కేవలం 2-3 అంగుళాలు సముద్రం ముందుకు వస్తే చెన్నై, ముంబై తోపాటు ఎన్నో నగరాల పరిస్థితి దారుణం అవుతుందన్నారు. బెంగళూరులో అభివృద్ధి పేరిట దారుణలు జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. అమెరికా అగ్రదేశమని అక్కడ కార్చిచ్చును నియంత్రించ లేకపోయారన్నారు. బెంగళూరుకు రెండో ఎయిర్‌పోర్ట్ అవసరం ఏం ఉందన్నారు. ఒక విమానాశ్రయం అంటే వేలాది ఎకరాలలో పచ్చదనం ఉండదన్నారు. కొండలను కరిగించి ఎంశాండ్ పేరిట భవనాలు నిర్మిస్తున్నారన్నారు. వైట్‌ట్యాపింగ్ రోడ్లతో నీరు భూమిలోకి ఇంకడం లేదన్నారు. సొరంగ మార్గం నిర్మించాలని భావిస్తున్నారని, ఇదంతా భూమిపై దాడేనన్నారు. భూమికి ఆటంకం జరిగితే ప్రకృతి వైపరీత్యం రాదా అని ప్రశ్నించారు. పర్యావరణ నిపుణులు పార్వతి శ్రీకారం, భార్గవి ఎస్ రావ్, సికిందర్, రేణుకాప్రసాద్‌లు పాల్గొన్నారు.

కిట్ల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



అధికారులు వెళ్లిపోవడంతో కిట్లకోసం వేచివున్న కార్మికులు

బంగారపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చే కిట్లను సజావుగా పం పిణీ చేయకపోవడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బంగారపేట పట్టణంలోని ఏపీఎంసీ కార్యాలయం వద్ద నమోదు చేసుకున్న కట్టడ కార్మికులకు కిట్‌లు ఇస్తామంటూ సమయాన్ని ముందుగా ప్రకటించారు. బుధవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2వరకు ఇస్తామన్నారు. అయితే కేవలం ఒక గంటమాత్రమే పంపిణీ చేయడంతో క్యూలో వేచియున్న 20మందికిపైగా కార్మికులు నిరాశతో వెనుదిరిగారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి కిట్లకోసం వచ్చినవారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘానికి చెందిన ప్రభు మాట్లాడుతూ.. కార్మికులకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు రూపొందించాయని అందులో భాగంగా కార్మికశాఖ ద్వారా నమోదు చేసుకున్న కార్మికులకు కిట్‌లను ఇస్తోందన్నారు. బుధవారం ఉదయం కొద్దిసేపే కిట్లను పంపిణీ చేసి గోడౌన్‌కు తాళాలు వేసి వెళ్లారన్నారు. డిపిహళ్ళి నుంచి వచ్చి క్యూలో ఉన్నానని అధికారులు కొందరికే కిట్లు ఇచ్చి వెనుతిరిగారని కార్మికుడు చంద్రమౌళి విచారం వ్యక్తం చేశారు. కాగా తాను మీడియాతో మాట్లాడేది లేదంటూ కార్మికశాఖ అధికారి రాజేశ్వరి వెళ్లిపోవడాన్ని పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు: ఎమ్మెల్యే



ద్వితీయ పీయూ విద్యార్థుల సన్మానంలో ఎమ్మెల్యే తదితరులు

బాగేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కావడంతో తాలూకాలోని ఏ ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం తాలూకా పంచాయతీ సభాంగణంలో నీరు, మేత తదితర సమస్యలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన సభ ఎమ్మెల్యే నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన మేరకు బోరు బావులను తవ్వించనున్నట్టు తెలిపారు. తాలూకాలోని లఘుమద్దేపల్లి, మూగచిన్నేపల్లి, బైరేపల్లిలలో తాగునీటి సమస్య ఉన్నట్టు గుర్తించామని ప్రత్యామ్నాయ వ్యవస్థ కల్పించ నున్నట్టు తెలిపారు. కాగా ఇటీవల కురిసిన అకాల వర్షంతో ఎలాంటి నష్టం లేదన్నారు. ఒకవేళ ఎవరైనా రైతులు పంట నష్టపోయినట్టు గుర్తిస్తే పరిహారం కల్పిస్తామన్నారు. కాగా పశుగ్రాసం సమస్య తలెత్తకుండా 25 వారాలకు సరిపడా మేతను ఇప్పటికే సేకరించినట్టు తెలిపారు. ఈనెల 22న దేవరగుడిపల్లిలో జనస్పందనా కార్యక్రమం ఉంటుందని సుమారు 3వేలమందికి వివిధ పథకాల లబ్ధి అందచేస్తామన్నారు. అధికారు లంతా తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఇదే సందర్భంగా హాస్టళ్లలో ఉంటూ ఎక్కువ మార్కులు పొందిన ద్వితీయపీయూసీ విద్యార్థులకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి, వ్యవసాయశాఖ డైరెక్టర్ లక్ష్మీ, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్ ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

14న రాజ్యాంగ రక్షణకు పోరాటం



మాట్లాడుతున్న రైతు నాయకులు

దొడ్డబళ్లాపుర, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణకై నిరాహారదీక్షతో పోరాటం చేయదలిచినట్టు అర్కావతి పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రవాసిమందిరంలో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 14న అంబేడ్కర్ జయంతిన తాలూకా కార్యాలయం వద్ద ఉపవాస దీక్ష చేపట్టనున్నట్టు రైతు నాయకుడు వసంత్‌కుమార్ తెలిపారు. బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థాలు, దొడ్డబళ్ళాపుర నగరసభ, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీ మురుగునీరు తాలూకాలోని దొడ్డ తుమకూరు, హొసహళ్ళి గ్రామ పంచాయతీలలో భూగర్భజలం కలుషితమైందన్నారు. ప్రస్తుతం మన ప్రాంతంలో పలువురు క్యాన్సర్, కిడ్నీ తదితర అవయవాల వైఫల్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఈనెల 14న సాంకేతికంగా పోరాటం చేస్తామన్నారు. దొడ్డబళ్ళాపుర, నగరసభ, బాశెట్టిహళ్ళి పట్టణ పంచాయతీల నుంచి వెలువడే మురుగునీటి శుద్ధీకరణకు మూడో ఎస్‌టీపీ విభాగం ఏర్పాటు చేయాలని, దొడ్డ తుమకూరు గ్రామపంచాయతీ, మజుర హొసళ్ళి గ్రామపంచాయతీలలో తాగునీటి కోసం వర్షపునీటి సేకరణకై ఇంకుడుగుంతలు వంటి కార్యాచరణ చేపట్టాలని, కాలుష్య నియంత్రణమండలిని దొడ్డబళ్ళాపురకు మార్పు చేయాలని, ఫ్యాక్టరీలలో ఇకపై బోర్లను తవ్వేందుకు అనుమతి ఇవ్వరాదని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో అర్కావతి పోరాట సమితికి చెందిన వసంతకుమార్, రమేశ్, సతీశ్‌కుమార్, మునికృష్ణ, నరసింహమూర్తి, కాళెగౌడ, విజయ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణగా వచ్చిన పోలీసులనే అంటారా..?

జగన్‌పై పల్లె సింధూర, పల్లె రఘునాథరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'పరామర్శకు వచ్చిన మీకు రక్షణ కల్పించిన పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడటం తగునా..?' అని మాజీ సీఎం జగన్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పోలీసుల బట్టలు ఊడదీసి రోడ్డుపై నెలబెడతామని ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. జగన్ వెంటనే పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'ప్రకృతి వైపరీత్యాలు, మహిళలపై దాడులు జరిగినా ఏనాడూ మీరు బాధితులను పరామర్శించేందుకు రాలేదు. కార్యకర్తలను రెచ్చగొట్టేందుకు జిల్లాకు వచ్చారు. అయినా మీ పర్యటనకు ప్రభుత్వం 1100 మంది పోలీసులు, ఇద్దరు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలతో బందోబస్తు ఏర్పాటు చేసింది. హెలిప్యాడ్ వద్ద 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది..' అని అన్నారు. బాధలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చి రోడ్ షో చేయడం ఏమిటని ప్రశ్నించారు. హెలికాప్టర్ మొరాయించిందని సాకు చెప్పారని, మొరాయించిన హెలికాప్టర్ బెంగళూరుకు ఎలా వెళ్ళిందని ప్రశ్నించారు. రూ.5.50 కోట్లు ఖర్చుచేసి పాపిరెడ్డిపల్లి పర్యటనకు వచ్చిన జగన్.. లింగమయ్య కుటుంబానికి నయా పైసా ఇవ్వకుండా వెళ్లారని విమర్శించారు. ప్రశాంతమైన గ్రామాల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి, కులాల మధ్య చిచ్చు పెట్టి.. విధ్వంసాలు సృష్టించాలన్నదే జగన్ ఉద్దేశమని ఆరోపించారు.

పకడ్బందీగా ఎన్‌డీఏ పరీక్షలు

- కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈనెల 13న నిర్వహిస్తున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్‌అకాడమీ-1(2025) పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 363 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేటపుడు హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదోఒక ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని అభ్యర్థులు రావాలన్నారు. మొబైల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించ మన్నారు. పరీక్షలకు నియమితులైన అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు

తస్తిక్ మొత్తాన్ని పెంచాలి



పంచాంగం క్యాలెండర్ విడుదల చేస్తున్న అర్చకులు

ముళబాగిలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ ఆలయాల అర్చకుల తస్తిక్ మొత్తాన్ని ఏడాదికి ఇస్తున్న రూ.72వేలనుంచి లక్ష రూపాయలకు పెంచాలని ఆలయ అర్చకులు, ఆగమికులు సంఘం రాష్ట్ర సంచాలకులు డాక్టర్ హెచ్ఎస్ గురుదీక్షిత్ డిమాండ్ చేశారు. ముళబాగిలు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో తాలూకా దేవాదాయ అర్చకులు, ఆగమికుల సంఘం ఆధ్వర్యంలో 2025-26 వార్షిక పంచాంగం క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గురుదీక్షిత్ మాట్లాడుతూ అనేకమంది అర్చకులకు వసతి సౌలభ్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటువంటివారికి నివాస సదుపాయం కల్పించాలన్నారు. అర్చకుల నియామకంలో వంశపారంపర్య అర్చకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్చకుల పిల్లల విద్యాభ్యాసానికి ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆగమ విద్వాన్ శ్రీవత్స తాలూకా అధ్యక్షుడు మంజునాథన్, రఘుకుమార్, కోటప్ప దీక్షిత్, వెంకటాచలపతాచార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పటాలమ్మ దేవి జాతర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వరద నాయకనహళ్ళిలో పటాలమ్మదేవి, వీరసొణ్ణమ్మదేవి రథోత్సవం, ఉట్లు ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయంలో విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలంకరించిన తేరుపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రజలంతా ఉత్సాహంగా రథం లాగారు. జాతరలో భాగంగా పలు దుకాణాలు ఏర్పాటయ్యాయి. భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేయడమే కాక అన్నసంతర్పణ నిర్వహించారు. వీరసొణ్ణమ్మదేవి ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో మహిళకు గాయాలు

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పొలానికి వెళ్లిన మహిళకు వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. లక్ష్మమ్మ రాజప్ప (30) ను చికిత్సకోసం బెంగళూరుకు తరలించారు. తాలూకాలోని హొసహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని సొణ్ణేనహళ్ళిలో బుధవారం మధ్యాహ్నం లక్ష్మమ్మ భర్త రాజప్ప పొలానికి అవసరమైన క్రిమిసంహారక మందులకోసం పట్టణానికి వెళ్లాడు. ఈవేళ తోటలో ఒంటరిగా పనిచేస్తున్న లక్ష్మమ్మపై ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేశాయి. ముఖం సహా పలుచోట్ల గాయాలయ్యాయి. ఆమెను బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. హొసహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన చోటు చేసుకుంది.

ఫెర్రర్ ఆశయ సాధనకు కృషి



హుండీలను ఓపెన్ చేస్తున్న మాంచోఫెర్రర్ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తన తండ్రి, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయ సాధనకు మరింత కృషి చేస్తామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ తెలిపారు. ఫాదర్‌ఫెర్రర్ 105వ జయంతి వేడుకలు బుధవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో 3800గ్రామాలలో నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఫాదర్ విన్సెంట్‌ఫెర్రర్ ప్రత్యేకంగా చేపట్టిన ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 1.60లక్షలు హుండీలను మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లు తెరిచారు. పేదలు సంపాదించి సేకరించిన మొత్తాన్ని పేద విద్యార్థుల ఉన్నత చదువులకే వినియోగించి ఫాదర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఫాదర్ చూపిన బాటలోనే నడుస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. అనంతరం బత్తలపల్లిలోని ఫాదర్ సమాధి వద్ద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.14	1,579.18
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5,067	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	3,699	293
నీటి నిల్వ (టీఎంసీలు)	7.42	4

'భయాందోళనలు వద్దు'

బళ్లారి సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన వ్యక్తి భయాందోళనకు గురికాకూడదని జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి సూచించారు. జిల్లా యంత్రాంగం, పంచాయితీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, సర్వేయర్ యూనిట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిడిగినమోళ సంయుక్తంగా నిర్వహించిన 'పాముకాటుపై అవగాహన' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాముకాటుకు గురైన సమయంలో ఆందోళనకు గురికాకుండా వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లాలన్నారు. అక్కడ వెంటనే చికిత్స చేయడం జరుగుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్ హెట్టాళ్ మాట్లాడుతూ పాముకాటుకు గురైన ప్రదేశంలో వస్త్రం కట్టరాదని, బ్లేడ్, కత్తితో కోయవద్దన్నారు. వెంటనే ఆసుపత్రికి తరలించాలన్నారు. సమావేశంలో సిడిగినమోళ గ్రామపంచాయితీ సభ్యుడు గాదిలింగగౌడ, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప నవర్, అంటువ్యాధుల నిపుణులు డాక్టర్ విశాలాక్షి, ఎం.సింధు, నవీన్‌ర, జిల్లా కలరా నియంత్రణ విభాగం శివకుమార్, సవిత, ఖాసీంవలి, మహమ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా డిండి ఉత్సవం

కంప్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హంపి పట్టణంలో గొందలి సమాజం ఆధ్వర్యంలో పాండురంగ డిండి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమంలో దావణగెర, కొప్పాళ, అరిసికెర, సండూరు, గజాపూర్, హోస్పేట్ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు, మహిళలు ఉత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. పాండురంగ దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో కాగడహారతి, పారాయణం, వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన



ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు

రాయచూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. అదే సమయంలో వంట గ్యాస్ ధరను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధరల పెంపును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కార్యకర్తలు సిలెండర్‌లను ముందుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముండిచెమరు ధరలు గణనీయంగా తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణి సామాన్య ప్రజలను ముంచి బడా కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టడమే పనిగా ఉందంటూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

రాయచూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి తాలూకా అంకుశదొడ్డి గ్రామానికి చెందిన గొర్లకాపరి రామణ్ణ నాయక్ పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాడు. మంగళవారం యథావిధిగా గొర్రెలను కాసేందుకు వెళ్లిన రామణ్ణ నాయక్ సాయంత్రం తిరిగి వస్తున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వడగళ్ల వాన ప్రారంభం కావడంతో పిడుగుపాటుకు గురైయ్యాడు. తీవ్రంగా గాయపడిన రామణ్ణ నాయక్‌ను గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మస్కి తాలూకా ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు బుధవారం గ్రామాన్ని సందర్శించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

విద్యార్థిని ఆత్మహత్య

సిరుగుప్ప, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పీయూసీ పరీక్షల్లో ఫెయిలైన కారణంగా కె. విజయలక్ష్మి (17) ఆత్మహత్య చేసుకున్న సంఘటన అగసనూరు గ్రామంలో జరిగింది. సిరుగుప్ప పట్టణం వీకేజేజే కళాశాలలో పీయూసీ చదువుతున్న విద్యార్థిని విజయలక్ష్మీ సమాజ విజ్ఞాన శాస్త్రంలో ఫెయిలైంది. ఈ కారణంగా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పోటాపోటీగా కేపీసీఎల్ ఎన్నికలు

కంప్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేపీసీఎల్ సంఘ సభ్యత్వ నమోదు ఎన్నికలు పోటాపోటీగా సాగాయి. ఇందులో శ్రీనివాసప్ప, దొడ్డ బసప్ప, వన్నూరు స్వామి, రామాంజినేయకులు, నాగరాజు, ఉమేష్, వెంకటాచలం తదితరులు గెలుపొందినట్లు ఎన్నికల అధికారి శ్రీరుదప్ప తెలిపారు.



గెలుపొందిన సభ్యులు

నైపుణ్య ఆధారిత కోర్సులతో ఉద్యోగాలు

ప్రొఫెసర్ ఎం. మునిరాజు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ మునిరాజు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్య ఆధారిత కోర్సులు అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందవచ్చని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఎం మునిరాజ్ అభిప్రాయపడ్డారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం, గాలి రుక్మిణమ్మ చెంగారెడ్డి స్మారక వాణిజ్య కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన కర్ణాటక సాంస్కృతిక నాయక బసవణ్ణ అనే ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, సుధామూర్తి, అంబాని లాంటి వారి సాధన స్ఫూర్తి గురించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే రోజుల్లో నైపుణ్య ఆధారిత కోర్సులను విశ్వవిద్యాలయాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సాహితి ప్రొఫెసర్ ఎస్.జిసిద్దరామయ్య మాట్లాడుతూ, దేశంలో సాంప్రదాయక గులామ్‌గిరి నుంచి విముక్తి పొందినపుడే సంపూర్ణ స్వాతంత్ర్యం పొందవచ్చని తెలిపారు. 12వ శతాబ్దం నాటి బసవణ్ణ సమాజంలో విప్లవాత్మకమైన తీసుకురావడానికి కృషి చేశారని, ఆయన ఆశయాలు పాటిస్తే నిజమైన స్వాతంత్రం పొందిన వారమవుతారని, మహోన్నత వ్యక్తులైన దివంగత గాంధీజీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ తత్వాలను పాటించడం ద్వారానే ప్రపంచంలో భారతదేశం గుర్తింపు పొందిందని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యవాతి, కంప్యూటర్ విభాగం డాక్టర్ హెచ్.రాచప్ప, డాక్టర్ హనుమేష్, జయశీల, డాక్టర్ వేదాంతలతోపాటు కళాశాల బోధక, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పీయూ ఫలితాల్లో బెస్ట్‌కాలేజ్ విద్యార్థుల ప్రతిభ



జై కిషన్ | సహన | లిఖిత | శ్రేయ | ధీరజ్ | మహీర్ | సాయి హర్షిత | పవన్‌కుమార్

బళ్లారి సిటీ, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ ఫలితాల్లో నగరానికి చెందిన బెస్ట్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబరిచినట్లు కాలేజ్ చైర్మన్ కోనంకి రామప్ప తెలిపారు. కళాశాల ప్రారంభం నుంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలో టాపర్లుగా నిలుస్తున్నట్లు వివరించారు. సైన్స్ విభాగంలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు జైకిషన్ 600 మార్కులకుగాను 581, ఎస్ సహన 581, లిఖిత.బి 580, శ్రేయ.బి. 577, దీరజ్ 575, మహీర్ 575, సాయి హర్షిత 571, పవన్‌కుమార్ 570మార్కులు సాధించి తమ కళాశాలకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిపెట్టిన విద్యార్థులను అందుకు సహకరించిన అధ్యాపకులను అభినందించారు. 20మంది విద్యార్థులు సైన్స్, గణితం, కన్నడ, వందకు వంద మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను వైస్ చైర్మన్ కోనంకి తిలక్, కార్యదర్శి మన్నె శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

నంది సిటీ కళాశాల విజయ భేరి



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పియు ద్వితీయ పరీక్షల్లో బళ్లారి నగరానికి చెందిన నంది సిటీ కళాశాలకు చెందిన విజ్ఞాన, వాణిజ్య విభాగాలకు చెందిన విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్స్ వీ అనిత, మక్సూద్ బాషా సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్లో పి.లావణ్య, హర్షదల్ వలి 600 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులు 589 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. వి.పవిత్ర 582, కె.ఇ. ఈశ్వరి, 578, ఎం.తేజ 574, సి.ంజనా 573, హెచ్.జి. నందిత 572, సైయ్యద్ హుసేన్ మత్వాల్ 571, మురళి ఎస్. ఉప్పార్ 571, బి.మానస 563, యువరాజ్ సింగ్ 560, జితేంద్ర పబ్బాతి 556, తరనుమ్ 551, ఆశితా జీఎస్. 550, టి.పూజలు 550లు మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన కళాశాల అధ్యాపక బృందానికి, ప్రోత్సహించిన తల్లితండ్రులకు, విద్యార్థులకు నంది గ్రూప్ ఆఫ్ సంస్థ సంచాలకులు ఉమేర్ అమ్మద్ అభినందనలు తెలియజేశారు.

శాంతరస స్ఫూర్తితో ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

సామాజిక ఉద్యమకారుడు సిద్ధనగౌడ పాటిల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు

రాయచూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవి, రచయిత, సాహితీవేత్త శాంతరస స్ఫూర్తితో దేశంలో సాగుతున్న ప్రైవేటీకరణ విధానాలను విద్యావంతులు ముక్తకంఠంతో ఎదురించాలని సామాజిక ఉద్యమకారుడు సిద్ధనగౌడ పాటిల్ పిలుపునిచ్చారు. సాహితీవేత్త శాంతరస శత జయంతి ఉత్సవాన్ని మంగళవారం రాత్రి నగరంలోని రంగమందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధనగౌడ పాటీల్ దేశంలోని పబ్లిక్ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేట్ పరం చేస్తు ఆదాని, అంబాని వంటి కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును విద్యావంతులు మేధావులు తీవ్రస్థాయిలో వ్యతిరేకించాలన్నారు. ప్రజాసంపదను కాపాడుకునేందుకు ప్రతియొక్కరు తమ బాధ్యతగా ఉద్యమబాట పట్టాలని కోరారు. ఇందుకు శాంతరస వంటి అభ్యుదయ కవులు, సాహితీవేత్తల రచనలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

హోసూరు జోన్

అన్నాడీఎంకే బూత్ కమిటీ సభ్యుల సమావేశం

హోసూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లా హోసూరు పశ్చిమ ప్రాంతం అరసనట్టిలోని 23వ ప్రాంతంలో అన్నాడీఎంకే బూత్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పార్టీ ఏరియా కార్యదర్శి మంజునాథ్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, అమ్మ పేరవై రాష్ట్ర ఉపకార్యదర్శి, కృష్ణగిరి పశ్చిమజిల్లా ప్రతినిధి పన్నీర్‌సెల్వం పాల్గొని బూత్ కమిటీ సభ్యులకు సలహా సూచనలు చేశారు. 2021 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే గెలుపొంది అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలకు ఇప్పటినుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. అన్నాడీఎంకే మళ్లీ అధికారంలోకి వచ్చేలా బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎక్కువ మెజారిటీ వచ్చేందుకు మహిళలే కీలకమన్నారు. బూత్ పరిధిలో స్థానికుల సమస్యలను పరిష్కరించి పార్టీ బలం పెంచాలన్నారు. కార్యక్రమంలో పొయ్యమొషి, చిట్టి జగదీశ్, చన్నకృష్ణన్, జయపాల్, మాజీ కౌన్సిలర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి తదితరులు

నీట్ కోచింగ్ సెంటర్‌లో కలెక్టర్ తనిఖీలు

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్న నీట్ కోచింగ్ సెంటర్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. 12వ తరగతి విద్యార్థులకోసం కృష్ణగిరి, ఉత్తంగరై, హోసూరులలో ఉచితంగా ప్రత్యేక నీట్ కోచింగ్‌సెంటర్లను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 3 సెంటర్లలోనూ 177మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. హోసూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని నీట్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఇక్కడ 13 ప్రభుత్వ పాఠశాలలనుంచి 55 మంది ట్రైనింగ్ పొందుతున్నారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను పదే పదే సాధన చేయాలని చక్కటి మార్కులు సాధించి వైద్యులు కావాలని కలెక్టర్ సూచించారు. వైద్య విద్యార్థులకోసం జరిగే వైట్ కోట్ వేడుకలో అందరూ పాల్గొనాలని ఆకాంక్షించారు. కోచింగ్ సెంటర్‌లోని ప్రాథమిక సౌకర్యాలు, పరీక్షకు అవసరమైన శిక్షణా పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ కురల్ వానుకి, జిల్లా నీట్ కోఆర్డినేటర్ తీర్థగిరి, హోసూరు సెంటర్ నీట్‌కోచ్ జ్ఞానసుందరి తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలో కలెక్టర్, సబ్ కలెక్టర్ తదితరులు

మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ

హోసూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో మాదకద్రవ్యాల నిర్మూలన అనే అంశంపై అవగాహనా ర్యాలీ జరిగింది. సబ్ కలెక్టర్ ప్రియాంక జెండా ఊపి ప్రారంభించారు. కామరాజ్ కాలనీ, తాలూకా ఆఫీస్ రోడ్డు, డెంకణీకోట్టై రోడ్డు ప్రధాన రహదారులమీదుగా ర్యాలీ సాగింది. యువతను దారి తప్పించేలా గంజాయి, గుట్కా విక్రయిస్తున్నారని, మాదకద్రవ్యాల వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఇదే సందర్భంగా గుట్కా ఇతర నిషేధిత వస్తువులు విక్రయించేవారి సమాచారం పోలీసు కార్యాలయం లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిస్తే గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవడంతో ముగిసింది. వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పళని హోసూరు ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ డీఎస్పీ మహాలక్ష్మి, హోసూరు డివిజనల్ రెవెన్యూ అధికారి బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



పచ్చజెండా ఊపి, ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రియాంక

టీబీ డ్యాం నూతన గేట్ల ఏర్పాటుపై దృష్టి



తుంగభద్ర జలాశయం

కంప్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర రిజర్వాయరుకు 32 క్రస్ట్ గేట్లకు భర్తీకి ఈ టెండర్ ప్రక్రియను సూచించాలని తుంగభద్ర బోర్డు కమిటీ నిర్ణయించింది. తుంగభద్ర జలాశయంలోని 33 క్రస్ట్ గేట్లలో 19వ క్రస్ట్ గేటు 2024 ఆగస్టు 10న కూలిపోయి 40 టీఎంసీల నీరు వృథా అయ్యాయి. రబీ పంటలకు నీరు కష్టమే అనుకున్న సందర్భంలో మరమ్మతుల నిపుణుడు కన్నయ్యనాయుడు, బోర్డు అధికారులు, సిబ్బంది నేతృత్వంలో తుంగభద్ర జలాశయం ఈ గేటు వద్ద స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతన్నల ఊపిరిపీల్చుకున్నారు. రిజర్వాయర్ క్రస్ట్ గేటును మార్చడానికి రూ.రెండు కోట్లు ఖర్చవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. మొత్తానికి జలాశయం నూతన గేట్లు ఏర్పాటు పైనే అధికారులు దృష్టి సారించినట్లు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే సలాం బళ్లారి

పలు వార్డులను సందర్శించిన సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారిరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి బుధవారం సలాం బళ్లారి ప్రచార కార్యక్రమం సందర్భంగా పలు వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నగరవాసులకు అందుబాటులో ఉండటానికే సలాం బళ్లారి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నూరు మహమ్మద్, మించు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సాదిక్, సుబ్బరాయుడు, బోయపాటి విష్ణువర్దన్, అబ్దుల్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుడి రథోత్సవం



ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న జనం

కంప్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలూకా పరిధిలోకి బాదనట్టి గ్రామంలో బుధవారం భావి ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం కలకంబ్ల రుద్రముని తాత కరిబసవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భావి ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవం ఊరేగించారు. ఈ రథోత్సవంలో కురుగోడు, కుడితిని, బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, గంగావతి, హోస్పేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు బీఎం సతీష్

సిరుగుప్ప, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకుందామని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు బీఎం సతీష్ పేర్కొన్నారు. బుధవారం సిరుగుప్ప పట్టణం బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకుందామన్నారు. కార్యక్రమంలో కొడ్లి మల్లికార్జున, బీజేపీ యువనాయకులు దరప్ప నాయక, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, సామయ్య, భోవి సమాజం అధ్యక్షులు గాలప్ప, ముస్లిం సమాజ అధ్యక్షులు అండీ హుసేన్, మునుస్వామి, కల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్ట సమీపంలో రైలు ఢీకొనడంతో ఓ చేనేత కార్మికుడు బుధవారం మృతి చెందాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు పట్టణంలోని సత్య సాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శంకర గోవిందు (62) సిద్దయ్యగుట్టలో ఉన్న తల్లిని మాట్లాడించేందుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో శంకర గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. పరీక్షించి శంకరగోవిందు మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య చౌడమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.